# వైద్య శాఖలో సంస్కరణలు

హైదరాబాద్, న్యూస్‌లైన్: వ్యవస్థీకృత లోపాలను సరిదిద్ది ప్రజారోగ్య సేవలను మెరుగుపర్చే చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే వ్యాధి నియంత్రణ కార్యక్రమాలను అమలు చేసే, నిధులను సమకూర్చే, వైద్య సేవలు అందించే, పర్యవేక్షించే సంస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొస్తోంది. ప్రాథమిక, సెకండరీ వైద్య సేవలు అందించే అన్ని సంస్థలను పర్యవేక్షించేందుకు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిషనరేట్ అనే కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న కుటుంబ సంక్షేమ కమిషనరేట్ పరిధి లోకి అన్ని రకాల విభాగాలను చేర్చిన ప్రభుత్వం దీనికి ఆర్యోగం, కుటుంబ సంక్షేమ కమిషనరేట్ అని పేరు మార్చింది. దీనికి ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు.

- ఒకే గొడుగు కిందకు ప్రాథమిక, సెకండరీ వైద్య సేవలు
- పర్యవేక్షణ, పథకాల పక్కా అమలుకు అవకాశం
- ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిషనరేట్ ఏర్పాటు



### కమిషనరేట్ పరిధిలోకి వచ్చే సంస్థలివీ..

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్), కమిషనరేట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శాక్స్), ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం), ఆంధ్రప్రదేశ్ వైద్య గృహ, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీహెచ్ఎంఐడీసీ) కార్యకలాపాలన్నింటినీ సమన్వయ పరిచి పర్యవేక్షించే బాధ్యతను ఇక నుంచి హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరేట్ నిర్వర్తించనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక కార్యక్రమాల అమలు, గ్రామీణ పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రజలకు అవగాహన పెంపు, మాతా శిశు మరణాలను తగ్గించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, (రెఫరల్ ఆస్పత్రులు లేదా సెకండరీ వైద్య సంస్థలు) వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో సౌకర్యాల పెంపు, సేవల మెరుగు కార్యక్రమాలను కమిషనరేట్ చూసుకుంటుంది.

### ఈ మార్పులు ఎందుకంటే...

ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల బాధ్యతలను వైద్య సంచాలక కార్యాలయం చూస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో టీకాలు వేయడం, పీహెచ్‌సీల నిర్వహణ వంటి పనులు వీటి కింద ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల సిబ్బంది చేయాలి. అయితే ఈ కార్యక్రమాల అమలు, నిధుల విడుదల బాధ్యతలను మాత్రం కుటుంబ సంక్షేమశాఖ నిర్వర్తిస్తోంది. పనిచేసే అధికారులు డీహెచ్ కింద ఉండగా అమలు చేసే బాధ్యత కుటుంబ సంక్షేమశాఖ కింద ఉంది. దీనివల్ల సమన్వయం, పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. అందువల్లే అన్ని విభాగాలను సమన్వయపర్చి సమర్థంగా కార్యక్రమాలను అమలు చేసేందుకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరేట్ ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ పీవీ రమేష్ న్యూస్‌లైన్‌కు తెలిపారు.

24-04-2010 Sakshi